సాక్షి
మంచిర్యాల
శుక్రవారం । 23 । ఆగస్టు । 2024



సీఎంను కలిసిన డీసీపీ భాస్కర్

మంచిర్యాలక్రైం: సీఎం రేవంత్‌రెడ్డిని మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ గురువారం కలిశారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(కేంద్ర మంత్రిత్వ శాఖ) ఆయనకు ఇటీవల ఐపీఎస్ హోదాను కల్పించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సీఎంను కలిశారు.



తండాలకు తీజ్ శోభ

గిరిజన తండాల్లో తీజ్ సందడి నెలకొంది. లంబాడాలు సంస్కృతి, సంప్రదాయాలను కొనసాగిస్తూ తొమ్మిది రోజులపాటు ఆటపాటలతో తీజ్ సంబరాలు నిర్వహించనున్నారు. 8లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
33.0 /26.0

మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. నైరుతి దిశగా ఈదురుగాలులు బలంగా వీస్తాయి.

శుద్ధమైన నీరేది..!



శాంతిఖని భూగర్భం నుంచి ఫిల్టర్‌బెడ్‌కు సరఫరా అవుతున్న రా వాటర్

- కార్మిక కుటుంబాలకు రా వాటర్ సరఫరా
- నీటిశుద్ధికి సకాలంలో ఇసుక సరఫరా చేయని కాంట్రాక్టర్
- ఓసారి వాడిన ఇసుకతోనే మళ్లీ ఫిల్టర్
- ఇతర అవసరాలకే నీటి వినియోగం

బెల్లంపల్లి: వర్షాకాలం.. వ్యాధుల కాలం. నీటి కలుషితం వల్ల ఎన్నో రకాల వ్యాధులు ప్రబలుతాయనేది జగమెరిగిన సత్యం. తాగునీటిని తప్పనిసరిగా నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా శుద్ధి చేయాల్సి ఉంటుంది. నీటిని శుద్ధి చేసిన తర్వాతనే సరఫరా చేయాల్సి ఉండగా బెల్లంపల్లిలోని సింగరేణి కార్మిక కుటుంబాలకు శుద్ధి చేయని నీటి(రా వాటర్) సరఫరా జరుగుతోంది. దీంతో కార్మిక కుటుంబాలు ఆ నీటిని తాగలేకపోతున్నారు. కనీసం స్నానం చేయడానికి కూడా ఉపయోగపడడం లేదనే వేదన కార్మికులను పట్టి పీడిస్తోంది. బొగ్గుతో నల్లగా మారి ఆయిల్, గ్రీస్‌తో కూడిన నీటిని సరఫరా చేస్తుండడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. బెల్లంపల్లిలో కార్మిక కుటుంబాలకు ఫిల్టర్ నీటి సరఫరా కోసం శాంతిఖని గని సమీపంలో కోదండ రామాలయం పక్కన ఫిల్టర్‌బెడ్‌ను దశాబ్దాల క్రితం నిర్మించారు. శాంతిఖని భూగర్భంలో నుంచి ఉపరితలానికి ప్రత్యేక పైపులైన్ ద్వారా ఫిల్టర్‌బెడ్‌కు నీటిని సరఫరా చేస్తున్నారు. ఆ నీటిని నాణ్యత కలిగిన ఇసుకతో నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం ఫిల్టర్ చేయాల్సి ఉంటుంది. కానీ ప్రస్తుతం అలా జరగడం లేదు. నెల రోజులుగా తీవ్రమైన ఇసుక కొరత ఉంటున్నట్లు సమాచారం. దీంతో భూగర్భంలో పని చేస్తున్న యంత్రాల గ్రీస్, ఆయిల్‌తో కూడిన నీటిని ఫిల్టర్‌బెడ్‌లో సరిగా శుద్ధి చేయలేకపోతున్నారు. ఇసుక లేక నీరు ఫిల్టర్ కాలేకపోతోంది. బొగ్గురంగుతో కూడిన నీరు ఏమాత్రం రూపాంతరం చెందకుండా ఉంటోంది. ఆ నీటినే అనివార్యంగా సరఫరా చేస్తుండడంతో కార్మిక కుటుంబాలు నీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రత్యామ్నాయంగా కార్మిక వాడల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన చేతిపంపు బోర్లకు మోటార్లు బిగించి నీటి అవసరాలు తీర్చుకుంటున్నారు.



ఇసుక కొరతతో రెండు బెడ్‌లను ఖాళీగా వదిలేసి ఓ బెడ్‌లో నీటి ఫిల్టర్

ఇతర అవసరాలకు..

కార్మిక క్షేత్రం బెల్లంపల్లిలో నాలుగు వేల పైచిలుకు కంపెనీ క్వార్టర్లు ఉన్నాయి. వీటిలో బెల్లంపల్లితోపాటు ఇతర ఏరియాల్లో పని చేస్తున్న దాదాపు నాలుగు వేల వరకు కార్మిక కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. మరో 500 వరకు కార్మికేతర కుటుంబాలకు సింగరేణి నల్లా కనెక్షన్లు ఉన్నట్లు తెలుస్తోంది. వీరందరికీ సింగరేణి బిల్డింగ్ డిపార్టుమెంటు ద్వారా నీటి సరఫరా చేయాల్సి ఉంటుంది. గత నెల రోజులుగా నీటిని సరిగా శుద్ధి చేయకుండానే రా వాటర్ సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. నీరంతా గ్రీస్, ఆయిల్ వాసనతో ఉండడం, నల్ల రంగుతో సరఫరా అవుతుండడంతో కేవలం బట్టలు ఉతకడానికి, బాత్రూం అవసరాలకు తప్ప మరెందుకూ వినియోగించుకోలేకపోతున్నట్లు కార్మికులు వాపోతున్నారు. కనీసం స్నానం చేయడానికి కూడా ఆ నీరు ఉపయోగపడడం లేదని, చెమటపట్టిన శరీరాన్ని శుద్ధి చేసుకోవడానికి నానాయాతన పడాల్సి వస్తోందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి విషయమై బెల్లంపల్లి బిల్డింగ్ డిపార్టుమెంటు సూపర్‌వైజర్ సతీష్ వివరణ కోసం ఫోన్ చేయగా స్పందించలేదు.

పట్టింపులేని కాంట్రాక్టర్

నీటిశుద్ధి కోసం ఫిల్టర్ బెడ్‌కు ఇసుక సరఫరా చేసే బాధ్యతను సింగరేణి యాజమాన్యం టెండర్ ద్వారా ప్రైవేటు కాంట్రాక్టర్‌కు అప్పగించింది. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ క్రమం తప్పకుండా ఇసుక సరఫరా చేయాల్సి ఉండగా ఏమాత్రం బాధ్యత లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో ఇసుక తవ్వకాలు జరగడం లేదని నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నట్లు చెబుతున్నారు. మరోమార్గం లేక, చేసేదేమీ లేక ఫిల్టర్ చేసి నాణ్యత కోల్పోయిన ఇసుకతోనే మళ్లీ నీటిని శుద్ధి చేస్తున్నారు. భవన నిర్మాణాలకు కావాల్సినంత ఇసుక లభిస్తుండగా నీటి శుద్ధికి ఇసుక లభించడం లేదని కాంట్రాక్టర్ చెబుతున్న సమాధానానికి సంతృప్తి చెందడం అధికారులకే చెల్లింది.

నీళ్లు మురికిగా వస్తున్నాయి



సింగరేణి సరఫరా చేస్తున్న నీరు మురి కిగా వస్తున్నాయి. కొన్ని రోజుల నుంచి సరిగా ఫిల్టర్ చేయడం లేదు. నీళ్లు బొ గ్గు రంగుతో వస్తుండడంతోపాటు ఆ యిల్ వాసన వస్తోంది. ఆ నీరు స్నా నం చేయడానికి వీలు లేకుండా ఉంటున్నాయి. నోట్లో వేసుకుని పుక్కిలించడానికి జంకుతున్నాం. బయటి అవసరాలకు మాత్రమే ఉపయోగిస్తున్నాం. ఆ మురికి నీరు కూడా వారానికోసారి సరఫరా చేస్తున్నారు. ఫిల్టర్ చేయ ని నీటితో నానా ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా పూర్తి స్థాయిలో నీటిని ఫిల్టర్ చేసిన తర్వాతనే సరఫరా చేయాలి.

– కానగంటి కుమారస్వామి, రిటైర్డు కార్మికుడు, బెల్లంపల్లి

అధికారులు చర్యలు తీసుకోవాలి



కార్మిక కుటుంబాల కు సరిగా ఫిల్టర్ చేయకుండానే నీటి సరఫరా చేయడం సరైంది కాదు. బిల్డింగ్ డిపార్ట్‌మెంట్ అధికారుల తీరును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. కొన్ని రోజుల నుంచి బొగ్గు రంగుతో నీటి సరఫరా జరుగుతున్నట్లు కార్మికులు మా దృష్టికి తీసుకు వచ్చారు. ఆయిల్, .గ్రీస్ వాసనతో ఉన్న నీటిని ఏ తీరుగా వాడుకుంటారో అధికారులకే తెలియాలి. కాంట్రాక్టర్‌తో మాట్లాడి నాణ్యత కలిగిన ఇసుకను తెప్పించి నీటిని సమగ్రంగా ఫిల్టర్ చేసిన తర్వాతే సరఫరా చేయాలి. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలి.

– దాగం మల్లేష్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రెటరి, బెల్లంపల్లి

నేరస్తులకు శిక్ష పడేలా కేసులు దర్యాప్తు

- రామగుండం సీపీ ఎం.శ్రీనివాసులు
- డివిజన్ అధికారులతో సమీక్ష సమావేశం



మాట్లాడుతున్న రామగుండం సీపీ శ్రీనివాస్

బెల్లంపల్లి: నేరస్తులకు శిక్ష పడేలా పూర్తి ఆధారాలతో పారదర్శకంగా కేసులు దర్యాప్తు చేయాలని రామగుండం సీపీ ఎం.శ్రీనివాసులు పోలీసు అధికారులను ఆదేశించారు. గురువారం కమిషనరేట్ కార్యాలయంలో బెల్లంపల్లి సబ్ డివిజన్ పరిధిలోని సీఐ, ఎస్‌హెచ్‌ఓలతో పెండింగ్ కేసులపై ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. సీపీ శ్రీనివాసులు మాట్లాడుతూ విచారణలో ఉన్న కేసులను సత్వరంగా పూర్తి చేయాలని అన్నారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేయాలని సూచించారు. డయల్ 100కు కాల్ వచ్చిన వెంటనే స్పందించి ఘటనాస్థలికి చేరుకుని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెట్టాలని, గంజాయి, ఇతర మత్తుపదార్థాల విక్రయాలు, రవాణా చేస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ(అడ్మిన్) సి.రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర, బెల్లంపల్లి ఏసీపీ ఎ.రవికుమార్, ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులు, సీసీఆర్‌బీ సీఐ బుద్దె స్వామి పాల్గొన్నారు.

వాహనాలను పర్యవేక్షించాలి

మంచిర్యాలక్రైం: పోలీసులు విధి నిర్వహణకు ఉపయోగించే వాహనాలను నిరంతరం పర్యవేక్షించాలని పోలీస్ కమిషనర్ శ్రీనివాసులు అన్నారు. కమిషనరేట్ పరిధిలో మంచిర్యాల, బెల్లంపల్లి సబ్ డివిజన్‌లోని వాహనాలను గురువారం సీపీ పరిశీలించారు. 24/7 గస్తీ నిర్వహిస్తూ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని తెలిపారు.

స్వచ్ఛంద సంస్థలు దరఖాస్తు చేసుకోవాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: దీనదయాల్ వికలాంగ పునరావాస పథకం, సమీకృత వృద్ధుల సంక్షేమ పథకాల్లో భాగంగా బాధితులకు పునరావాసం కల్పించే కేంద్రాల్లో మరింత మెరుగైన సేవలకు ప్రభుత్వయేతర సంస్థలు(ఎన్‌జీవో) సెప్టెంబర్ 16లోగా జిల్లా స్త్రీ, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సాధికారత సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి స్వరూపారాణి ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత పత్రాలు జతపరిచి కార్యాలయానికి చేరేలా పోస్టు ద్వారా కూడా పంపించవచ్చని తెలిపారు.

న్యూస్‌రీల్

ఆర్‌వోఆర్ చట్టంపై ప్రజాభిప్రాయ సేకరణ

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రభుత్వం చేపట్టిన నూతన ఆర్‌వోఆర్ చట్టం–2024పై ప్రజాభిప్రాయ సేకరణ ముసాయిదా బిల్లుపై ప్రజల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించనున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) సబావత్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ అభిప్రాయాలను ఈ నెల 23లోగా https://ccla.telangana.gov.in, ఈ–మెయిల్ ద్వారా టౌట20 24-rev@telangana.gov.in, పోస్టు ద్వారా సీసీఎల్‌ఏ కార్యాలయం, ల్యాండ్ లీగల్ సెల్, నాంపల్లి స్టేషన్ రోడ్డు, అన్నపూర్ణ హోటల్ ఎదురుగా అబిడ్స్, హైదరాబాద్–500001కు పంపించవచ్చని తెలిపారు. ఈ నెల 24న నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని మేధావులు, ప్రజలు, నిపుణులు సదస్సుకు హాజరై తమ అభిప్రాయాలు, సూచనలు అందించాలని తెలిపారు.

డీసీవోగా సంజీవరెడ్డి బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన సంజీవరెడ్డి

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా సహకార శాఖ అధికారి(డీసీవో)గా సంజీవరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించా రు. గత కొంతకాలంగా పెద్దపల్లి జిల్లా సహకా ర శాఖ అధికారి రాంమోహన్‌రెడ్డి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తుండగా.. వరంగల్ జిల్లా డీసీవో సంజీవరెడ్డిని రెగ్యులర్ డీసీవోగా బదిలీ చేశారు. 2016నుంచి 20వరకు జిల్లా డీసీవోగా పని చేసిన ఆయన వరంగల్ జిల్లాకు బదిలీ అయ్యారు. తాజాగా రాష్ట్ర స్థాయి బదిలీల్లో భాగంగా మళ్లీ జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా డీసీవో సంజీవరెడ్డి మాట్లాడుతూ సొసైటీల్లో ఎప్పటికప్పుడు ఆడిటింగ్ నిర్వహించాలని, రైతుల అవసరాల మేరకు ఎరువులు అందుబాటులో ఉంచాలని సూచించారు. రుణాల సద్వినియోగం, దుర్వినియోగంపై విచారణ చేపడుతామని తెలిపారు. డీసీవో కార్యాలయ అధికారులు హన్మంత్‌రెడ్డి, రవీందర్‌రావు, వెంకటరమణ, సందీప్, రవికిషోర్, ప్రసాద్‌రావు, సురేందర్ పాల్గొన్నారు.

బ్యాంకు ప్రైవేట్ ఉద్యోగి లంచావతారం

- రైతుల నుంచి డబ్బులు డిమాండ్
- పోలీసులకు ఫిర్యాదు చేస్తానన్న బాధితుడు



రైతుకు డబ్బులు తిరిగి ఇస్తున్న సాయికుమార్

జన్నారం: రైతు రుణమాఫీ రెన్యూవల్‌కు బ్యాంకులోని ప్రైవేటు ఉద్యోగి లంచావతారం ఎత్తాడు. డబ్బు ఇస్తుండగా మరో రైతు పట్టుకుని నిలదీయడంతో విషయం బయటపడింది. బాధితుడు, రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. జన్నారంలోని ఎస్‌బీఐలో మండలంలోని హాస్టల్‌తండాకు చెందిన మ్యాక ఎర్రయ్యకు రూ.1.88లక్షలు రుణం మాఫీ అయింది. పంట రుణం రెన్యూవల్‌కు నాలుగు రోజుల క్రితం బ్యాంకుకు వెళ్లగా బ్యాంకులో పని చేసే ఫిట్ ఆన్ స్ట్రీట్(ఎఫ్‌ఓఎస్) సాయికుమార్ రూ.35వేల డిమాండ్ చేశాడు. అంత ఇవ్వలేనని చెప్పడంతో రూ.20వేలకు ఒప్పుకున్నాడు. గురువారం డబ్బులు ఇచ్చేందుకు ఎర్రయ్య బ్యాంకుకు రాగా ధర్మారం రోడ్డులోని తన ఇంటికి రావాలని సాయికుమార్ తెలిపాడు. ఎర్రయ్యతోపాటు బద్రు అనే వ్యక్తి వెళ్లి రూ.15వేలు ఇవ్వగా.. రూ.20వేలు ఇవ్వాలని ఒత్తిడి తెచ్చాడు. డబ్బులు ఇస్తుండగా మరోవ్యక్తి వీడియో తీశాడు. గమనించిన సాయికుమార్ డబ్బులు తిరిగి ఇచ్చేందుకు ప్రయత్నించగా వారు తీసుకోలేదు. రైతులు బ్యాంకుకు వెళ్లి ఆందోళన చేపట్టగా మేనేజర్ బయటకు వచ్చి వివరాలు సేకరించారు. అప్పు తెచ్చి ఇచ్చానని, పోలీసులకు ఫిర్యాదు చేస్తానని ఎర్రయ్య తెలిపాడు. తనకు కూడా రుణం పెంచి, త్వరగా అయ్యేలా చూస్తానని రూ.30వేలు డిమాండ్ చేశాడని బంగారుతండాకు చెందిన రైతు లాకవత్ బాబులాల్ ఆరోపించాడు. రూ.10వేలు నగదు, రూ.20వేలు ఫోన్ చేసినట్లు పేర్కొన్నాడు. కాగా, డాక్యుమెంటు త్వరగా పూర్తి చేసి రుణం ఇప్పించాలని తనపై ఒత్తిడి తెచ్చారని, కష్టగట్టి ఇరికించారని, బాబులాల్ వద్ద అప్పుగా తీసుకున్నానని సాయికుమార్ తెలిపాడు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని బ్యాంకు మేనేజర్ మహేశ్ తెలిపారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- వైద్యశిబిరం తనిఖీ



వైద్యాధికారితో మాట్లాడుతున్న కలెక్టర్

బెల్లంపల్లి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం బెల్లంపల్లి పట్టణంలోని మహ్మద్ ఖాసీం బస్తీలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విషజ్వరాలు, సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, వ్యాధులు రాకుండా పాటించాల్సిన నియమాలను ప్రజలకు అర్థమయ్యే విధంగా వివరించి చైతన్యపర్చాలని అన్నారు. తాగునీటి వాటర్‌ట్యాంకులు, నివాసాలకు సరఫరా చేస్తున్న నీటిని ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలని, జనావాసాలకు చేరువలో ఉన్న నీటిగుంతలను పూడ్చి వేయించాలని ఆదేశించారు. దోమల నియంత్రణకు ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయించాలని, మురికి గుంతల్లో ఆయిల్‌బాల్స్ వేయాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని వివరించారు. మున్సిపల్ కమిషనర్ కే.శ్రీనివాసరావు, చైర్ పర్సన్ జీ.శ్వేత, వైద్యాధికారి సౌజన్య, కౌన్సిలర్ గెల్లి రాజలింగు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై నిర్లక్ష్యం వద్దు

మందమర్రిరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని అభివృద్ధి, సంక్షేమ పనులపై నిర్లక్ష్యం చేయొద్దని జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ అధికారులకు సూచించారు. గురువారం ఆయన మున్సిపల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. అభివృద్ధి, సంక్షేమ పనులపై కమిషనర్ వెంకటేశ్వర్లు, డీఈఈ సుమతిని అడిగి తెలుసుకున్నారు. పలు వార్డులను సందర్శించిన అనంతరం కలెక్టర్ మాట్లాడారు. ప్రజాపాలన కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించాలని తెలిపారు. మున్సిపల్ ఏఈ అచ్యుత్, మేనేజర్ కృష్ణప్రసాద్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్ పాల్గొన్నారు.

దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలి

- డీఈవో యాదయ్య



మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

మంచిర్యాలఅర్బన్: ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు సాధారణ విద్యార్థులతో సమానంగా అన్నిరంగాల్లో రాణించాలని డీఈవో యాదయ్య అన్నారు. గురువారం మంచిర్యాల బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో భారత కృత్రిమ అవయవాల నిర్మాణ సంస్థ(అలీమ్‌కో) తెలంగాణ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాల విద్యార్థులకు ఉపకరణాల గుర్తింపు శిబిరం నిర్వహించారు. 185 మంది దివ్యాంగులు హాజరయ్యారు. విద్యార్థులకు వీల్ చైర్స్, వినికిడి యంత్రాలతోపాటు పలు రకాల పరికరాలు అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహిత విద్య కో–ఆర్డినేటర్ చౌదరి, ఎంఈవో పోచయ్య, డీఎస్‌వో మధుబాబు, అలిన్ కో డాక్టర్ రూపేష్, వైద్యులు శివప్రతాప్, అశోక్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ పాఠశాల నుంచి ఐదు నామినేషన్లు పంపించాలి

మంచిర్యాలఅర్బన్: ఇన్‌స్పైర్ నామినేషన్ల కోసం ప్రతీ పాఠశాల నుంచి ఆగస్టు 31లోపు ఐదు నామినేషన్లు పంపించాలని డీఈవో యాదయ్య సూచించారు. గురువారం డీసీఈబీ కార్యాలయంలో నామినేషన్ల పెంపు కోసం ఎంఈవోలు, నామినేషన్ల పెంపుదల కమిటీ సభ్యులు, కాంప్లెక్స్, పాఠశాల ప్రధానోపాధ్యాయులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. 34 పాఠశాల నుంచి 156 నామినేషన్లు పంపించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో డీఎస్‌వో మధుబాబు, సెక్టోరియల్ అధికారులుచౌదరి, సత్యనారాయణమూర్తి, ఎంఈవో పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలి

నెన్నెల: విద్యార్థులు సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలని డీఈవో యాదయ్య అన్నారు. గురువారం ఆవుడం హైస్కూల్‌లోని అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను పరిశీలించారు. విద్యార్థులు చేసిన ప్రయోగాలను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి దండనాయకుల ప్రకాష్‌రావు, హైస్కూల్ హెచ్‌ఎం రాజ్యలక్ష్మీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రుణమాఫీ అందరికీ అమలు చేయాలి



మంచిర్యాలలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, పాల్గొన్న నాయకులు

- మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు
- జిల్లాలో బీఆర్‌ఎస్ ధర్నాలు

మంచిర్యాలక్రైం/మంచిర్యాలరూరల్(హాజీపూర్)/దండేపల్లి/లక్సెట్టిపేట: రైతులందరికీ రుణమాఫీ అమలు చేయాలని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ అధిష్టానం పిలుపు మేరకు గురువారం జిల్లాలో ఆ పార్టీ ఆధ్వర్యంలో రైతు ధర్నా నిర్వహించారు. మంచిర్యాలలోని వెంకటేశ్వర టాకీస్ సమీపంలో, హాజీపూర్, దండేపల్లి, లక్సెట్టిపేటలో రైతులు, బీఆర్‌ఎస్ నాయకులు ధర్నా చేశారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు మాట్లాడుతూ రైతు రుణమాఫీపై మంత్రులు పొంతన లేని మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు మర్చిపోయి ఆంక్షలతో రైతులను మోసం చేస్తోందని విమర్శించారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ.2లక్షల వరకు రైతుల రుణాలన్నీ మాఫీ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు నడిపెల్లి విజిత్‌రావు, మున్సిపల్ మాజీ చైర్మన్ పెంట రాజయ్య, మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం, హాజీపూర్ మండల పార్టీ అధ్యక్షుడు జీవన్‌రావు, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు గోళ్ల శ్రీనివాస్, జెడ్పీ మాజీ కోఆప్షన్ సహీంపాషా, లక్సెట్టిపేట మున్సిపల్ వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు చుంచు చిన్నయ్య, పట్టణ అధ్యక్షుడు పాదం శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ లింగన్న, దండేపల్లి పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు జాడి వెంకటేశ్, గడ్డం మల్లారెడ్డి, భూమన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య

మాఫీ అయ్యే వరకు పోరాటం

బెల్లంపల్లి: ప్రతీ రైతుకు రుణమాఫీ అయ్యే వరకు బీఆర్‌ఎస్ పోరాడుతుందని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. గురువారం బెల్లంపల్లి ఆర్డీవో కార్యాలయం ఎదుట రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 15వరకు రైతులందరినీ రుణవిముక్తులను చేస్తామని చెప్పి పార్లమెంటు ఎన్నికల్లో లబ్ధి పొంది దగా చేశారని విమర్శించారు. కేవలం 40శాతం వరకు మాత్రమే రుణమాఫీ ప్రక్రియ పూర్తి చేశారని పేర్కొన్నారు. అనంతరం ఆర్డీవో హరికృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, సీనియర్ నాయకుడు ఇ.సుందర్‌రావు, బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్, బీఆర్‌ఎస్, అనుబంధ సంఘాల శ్రేణులు రేవెల్లి విజయ్, పుల్లూరి మౌనిక్, సుమంత్, ఆడేపు అరుణ్, మధు, తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేసిన ప్రభుత్వం



ధర్నాలో బీఆర్‌ఎస్ నాయకులు

చెన్నూర్: ప్రభుత్వం రుణమాఫీ పేరుతో రైతులను మోసం చేసిందని, ఎలాంటి ఆంక్షలు లేకుండా రు ణమాఫీ చేయాలని బీఆర్‌ఎస్ నియోజకవర్గ నాయకుడు రాజారమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పాత తహసీల్ కార్యాలయం ఎ దుట ధర్నా చేశారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూ లమాలలు సమర్పించారు. అనంతరం కొత్త బస్టాండ్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాజారమేశ్ మాట్లాడుతూ 75శాతం మంది రైతుల కు ఎగ్గొట్టి ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజ్, కౌన్సిలర్లు రెవెల్లి మహేశ్, నాయకులు రత్న సమ్మిరెడ్డి, విద్యాసాగర్, సాంబగౌడ్, సురేశ్‌రెడ్డి, నాయిని సతీశ్, ఆసంపల్లి రమేశ్, మాజీ సర్పంచ్ రాకేశ్‌గౌడ్, బొగె భారతి పాల్గొన్నారు.

బదిలీ అయిన ఎస్జీటీలను రిలీవ్ చేయాలి

భీమారం: ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన కౌన్సెలింగ్‌లో బదిలీ అయిన ఎస్‌జీటీలను వెంటనే రిలీవ్ చేయాలని, వారి స్థానంలో విద్యావాలంటీర్లను నియమించాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అసంపల్లి రమేశ్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో డీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మట్లాడుతూ ఉపాధ్యాయులను రిలీవ్ చేస్తే కొత్త చోటవారు విధుల్లో చేరుతారని అన్నారు. ఉపాధ్యాయులకు రావాల్సిన జీపీఎఫ్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ డీఏ తక్షణమే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కుమార్, కార్యదర్శి అప్పారావు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాలఅగ్రికల్చర్: 2024–25 విద్యాసంవత్సరంలో దివ్యాంగ విద్యార్థులు ప్రీ–మెట్రిక్, పోస్టు మెట్రిక్, టాప్ క్లాస్ ఎడ్యుకేషన్ ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి స్వరూపారాణి తెలిపారు. మహిళ, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ స్కాలర్‌షిప్ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా నూతన ఉపకార వేతనాలు రెన్యూవల్‌కు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. 9, 10వ తరగతి విద్యార్థులు ఈ నెల 31లోగా, ఇంటర్మీడియెట్, డిగ్రీ, పీజీ/డిప్లమా విద్యార్థులు అక్టోబర్ 31లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. www.depwd.gov.in, https://scholarships.gov.inలో నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గుడిపేట శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఎండీ మహమూద్(58) చికిత్స పొందుతూ మృతిచెందాడు. హాజీపూర్ ఎస్సై గోపతి సురేశ్ కథనం ప్రకారం.. గుడిపేటకు చెందిన ఎండీ మహమూద్ బుధవారం కూలీ పనికి వెళ్లి తిరిగి జాతీయ రహదారిపై నడుచుకుంటూ వస్తుండగా రాత్రి గుర్తు తెలియని వాహనం వేగంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్రగాయాలయ్యాయి. 108 ద్వారా మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారుడు సలీం ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని ఓల్డ్‌కాలనీకి చెందిన గూడెపు శివకుమార్ (40) జీవితంపై విరక్తితో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణ ఎస్సై అంజయ్య కథనం ప్రకారం.. కొన్నేళ్ల క్రితం భార్య కాపురానికి రావడం లేదనే బాధతో మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెంది గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఒకరి రిమాండ్

మంచిర్యాలక్రైం: 2016లో నమోదైన గృహహింస కేసులో సీసీసీ నస్పూర్‌కు చెందిన లగిశెట్టి సందీప్‌కుమార్ కోర్టుకు హాజరుకాకుండా తప్పించుకు తిరగడంతో న్యాయమూర్తి ఉపనిషద్వని నాన్‌బెయిలెబుల్ వారంట్ జారీ చేశారు. మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ నరేశ్‌కుమార్ ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసి గురువారం నిందితుడిని అరెస్ట్ చేశారు. న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించారు.

విషజ్వరంతో బాలిక మృతి


అనురాధ (ఫైల్)

కాగజ్‌నగర్‌రూరల్: విషజ్వరంతో బాలిక మృతిచెందిన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. కుటుంబీకులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని కొసర్‌నగర్‌కు చెందిన అనురాధ (11) లక్సెట్టిపేటలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతుంది. ఎస్సీ బాలికల హాస్టల్‌లో ఉంటుంది. ఈనెల 16న జ్వరం రావడంతో ఇంటికి వచ్చింది. బాలికకు జ్వరం తీవ్రత ఎక్కువగా ఉన్నందున కుటుంబీకులు పట్టణంలోని ఆర్‌ఎంపీ వద్ద బుధవారం తీసుకెళ్లారు. చికిత్స పొందుతుండగానే ఒక్కసారిగా ఫిట్స్ వచ్చింది. మంచిర్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సలహా మేరకు కరీంనగర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది.

దుబాయ్‌లో అనారోగ్యంతో ఒకరి మృతి

భైంసారూరల్: ఉపాధి కోసం దుబాయ్ వెళ్లిన కోతల్‌గాం వాసి అనారోగ్యంతో మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని కోతల్‌గాం గ్రామానికి చెందిన సట్ల నర్సయ్య(50) గతంలో వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. అప్పులపాలు కావడంతో ఉపాధి కోసం గతేడాది దుబాయ్ వెళ్లాడు. అక్కడే పని చేస్తున్నాడు. కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బుధవారం మృతిచెందాడు. రాష్ట్రప్రభుత్వం మృతదేహాన్ని స్వదేశానికి రప్పించేలా చర్యలు తీసుకోవాలని కుటుంబీకులు కోరుతున్నారు. మృతుడి భార్య సుగుణ, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

తండాలకు తీజ్ శోభ

తెలంగాణ పండుగల్లో బతుకమ్మ, బోనాలు ప్రత్యేకమైనవి. ప్రకృతిని పూజించి పువ్వులు, గడ్డితో జరుపుకునే సంప్రదాయ చరిత్రకు ఆనవాళ్లు ఇవి. ఈ రెండింటిలోనూ మహిళలకే ఎక్కువ ప్రాధాన్యం కనిపిస్తుంది. గిరిజన లంబాడా యువతులు జరుపుకునే తీజ్(గడ్డి బతుకమ్మ) పండుగ సైతం ఈ కోవలోకే వస్తుంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని వివిధ మండలాల్లో తీజ్ ఉత్సవం ప్రారంభమైంది. పెళ్లికాని యువతులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

- గిరి గ్రామాల్లో సందడి
- పెళ్లి కాని యువతులకు ప్రత్యేకం
- ఉమ్మడి జిల్లాలో ప్రారంభమైన వేడుకలు


కెరమెరి: గోధుమ బుట్టల్లో నీళ్లు చల్లుతున్న యువతులు


కెరమెరి: గోధుమలకు నీరు చల్లడానికి వస్తున్న యువతులు

కెరమెరి/లింగాపూర్: గిరిజన తండాల్లో పెళ్లికాని యువతులు ప్రత్యేకంగా జరుపుకొనే పండుగ తీజ్. లంబాడాలు తమ సంస్కృతిని, సంప్రదాయాలను కాపాడుతూ నియమ నిష్టలతో 9 రోజులు ఈ వేడుకలు నిర్వహిస్తారు. ఆటాపాటలు, వినోదాలు, వినూత్న ఆచారాలతో ఈ పండుగ బతుకమ్మ తరహాలో ఉంటుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటికే ఈ వేడుకలు ప్రారంభమయ్యాయి. శ్రావణమాసంలో రాఖీపౌర్ణమి రోజు ప్రారంభమైన తీజ్ ఉత్సవం శ్రీ కృష్ణాష్టమికి ముగుస్తుంది.

తీజ్‌లో నిమగ్నం

రాఖీ పౌర్ణమి నుంచి లంబాడా గిరిజనులంతా 'తీజ్'పండుగ జరుపుకోవడంలో నిమగ్నమై ఉన్నారు. ఓ వైపు పెళ్లికాని యువతులు ఆడిపాడుతూ కుల దేవతలను కొలుస్తూ ఎర్రమట్టిలో గోధుమలు చల్లుతారు. ఆ బుట్టలనే తీజ్ అంటారు. దీన్ని 'తీజ్ భరాయిరో'పిలుస్తారు. ఆరోజు నుంచి నియమనిష్టలు పాటిస్తారు. గ్రామానికి మంచి జరగాలని, మంచి భర్త రావాలని కోరుతూ ఉపవాస దీక్ష ప్రారంభించారు. మూడు పూటలు బావుల వద్దకు వెళ్తారు. అక్కడి నుంచి తెచ్చిన నీళ్లను 'తీజ్'లపై చల్లుతున్నారు. ఆరు రోజుల పాటు ఇదే ప్రక్రియ కొనసాగుతుంది.

ఏడో రోజూ 'ధమోళీ'సందడి

ప్రతీ ఇంట్లో బియ్యపు పిండితో రొట్టెలు చేసి బెల్లం నెయ్యితో కలుపుతారు. దీన్నే చేర్మా అని అంటారు. ఈ చేర్మా ఉన్న తీజ్ బుట్టలను ఇంటి ఆవరణలో నెలకొల్పిన కులదేవుడు 'సేవాభయ్యా'కు శాఖాహారి నైవేద్యంగా సమర్పిస్తున్నారు. అదేరోజు ఇంటి సింహద్వారానికి ఎదురుగా జొన్నలతో నింపిన గోనె సంచులు.. వాటి ముందు నీళ్ల కడవ ఉంచి దానిలో వేప మండలు పేర్చుతారు. కడవ ముందు జొన్న పిండితో ముగ్గులు వేస్తారు. వాటి మధ్య వెండితో తయారు చేసిన 'మేరామ యాడి'తల్లి విగ్రహాన్ని ఉంచి దీపం వెలిగించి పూజ చేస్తారు. ఆమె మాంసాహారి అయినందున మేకపోతు బలి ఇస్తారు. ఆ రాత్రి యువతులు ఇంటింటికీ చేర్మాని సేకరిస్తారు. ఏడో రోజు వరుసైన వారికి పూస్తూ నృత్యాలు చేయడంతో ధమోళీ సందడి మొదలవుతుంది.

ఎనిమిదో రోజు 'గణగోర్'వివాహం

ఎనిమిదో రోజు చెరువు వద్దకు వెళ్లి మట్టిని తీసుకుస్తారు. రెండు, ఆడ, మగ బొమ్మలు తయారు చేస్తారు. ఆడ బొమ్మకు గాంగ్రి, మగ బొమ్మకు ధోవతి, లాల్చితో వేషధారణ చేస్తారు. ఆ బొమ్మలను మేళతాళాలతో తీజ్‌లు ఉన్న చోటకు ఊరేగింపుగా తీసుకెళ్తారు. అక్కడ ఆ బొమ్మలకు వివాహం ఘనంగా జరిపిస్తారు. అక్కడే లాప్సీ(పాయసం) తయారు చేసి ఉత్సవ ప్రతిమలకు నైవేద్యంగా సమర్పిస్తారు. 'గణ'అంటే వారి కులదేవత. 'మేరామ యాడి'అని 'గోర్'అంటే కుల దేవుడు సేవాభయ్యా అని గిరిజనులు పిలుస్తుంటారు. వారిరువురికి ఈ రోజు పెళ్లి చేసినట్లు చెప్పుకుంటారు.

తొమ్మిదో రోజు..

ఆఖరి తొమ్మిదో రోజును 'తీజ్ తోడేరో దాడో'అని పిలుస్తారు. ఆ రోజు యువతులు ఇంటింటికి వెళ్లి తీజ్‌లు తెంపడానికి రావాలని అందరినీ ఆహ్వానిస్తారు. వారు వచ్చాకే మంచె పైనున్న తీజ్ బుట్టలను కిందికి దించుతారు. కులదేవతలను పూజిస్తూ 'తీజ్'నారును తెంపుతారు. దాన్ని వరుసగా కూర్చున్న మగవారి తలపాగాలో పెడతారు. ఆడవారైతే కొంగుకు, ఇంకొందరు ఇంటి గుమ్మానికి కడుతారు. అనంతరం జొన్నరొట్టెలు చేసి డప్పు వాయిద్యాలతో తీజ్ నిమజ్జనానికి బయల్దేరి చెరువులు లేదా బావుల వద్దకు వెళ్లి నిమజ్జనం చేస్తారు. దీన్నే 'తీజ్ ఎరాయోరో'అంటారు. ఇది ఒక లంబాడా బతుకమ్మగా భావిస్తారు. గోర్ బంజారాలు నిర్వహించే ఈ పండుగలో వారి సంస్కృతి ఉట్టిపడుతుంది. పంచకట్టు, ఖమీజ్ రుపాట్ ధరించి పురుషులు, టుక్రి, కాంచ్లీ, చేతులకు బలియాలు వేసుకుని యువతులు, సంస్కృతికి తగ్గట్టుగానే తయారువుతారు. గడ్డి బతుకమ్మను తెచ్చి ఆడపడుచులు సోదరుల కాళ్లు కడుగుతారు. ఆపై పారే నీటిలో గడ్డి బతుకమ్మలను వదులుతారు.

తీజ్ ఎంతో ఇష్టం


తీజ్ పండుగంటే ఎంతో ఇష్టం. బుట్టల్లో గోధుమలకు 9 రోజులు నీళ్లు పోస్తూ చివరి రోజు ఉత్సవం జరుపుకుంటాం. ఇలా జరుపుకోవడంతో అన్ని కార్యాలు సిద్ధిస్తాయని పెద్దలు చెబుతారు. పాడి పంటలు, ఇంటిల్లిపాది, గ్రామంలోని ప్రజలు సుఖశాంతులతో ఉంటారు.
– జె.దివ్యరాణి, చందుగూడ, కెరమెరి

నిధులు మంజూరు చేయాలి


గిరిజనులు సంస్కృతి సంప్రదాయబద్ధంగా తీజ్ జరుపుకుంటారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని వేడుకుంటాం. తీజ్ ఉత్సవాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి.
– జాధవ్ గణపత్, మాజీ ఎంపీపీ, లింగాపూర్

ఆలయానికి వెళ్లి నీటిని తెచ్చి..


పెళ్లికాని యువతులు 9 రోజులు డప్పుచప్పుళ్లతో ఉదయం, సాయంత్రం జగదాంబదేవి ఆలయానికి వెళ్తారు. అక్కడ మంచి నీరును తీసుకువచ్చి నాయక్ ఇంటికి వస్తారు. తీజ్ బుట్టల్లో నీరు చల్లుతారు.
– రాథోడ్ కిరణ్ నాయక్, లింగాపూర్

నియమ నిష్టతో ఉంటాం


తీజ్ ఉత్సవాన్ని 9 రోజులు నియమ నిష్టతో జాగరణలో ఉండి పూజలు చేస్తాం. ఉత్సవాలు ముగిసేవరకు ఒక పూట భోజనం చేస్తాం. చివరి రోజు ఉపవాస దీక్షతో ఉంటాం. భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహిస్తాం.
– జాదవ్ మౌనికాబాయి, లింగాపూర్

ఉపాధి కోసం వెళ్లి.. కానరాని లోకాలకు

- ఇరాక్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం
- చింతగూడలో విషాదం


రాజమల్లు (ఫైల్)

జన్నారం: ఉపాధి కోసం ఇరాక్ వెళ్లిన యువకుడు కానరాని లోకాలకు వెళ్లాడు. అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. జన్నారం మండలం చింతగూడలో విషాదం నెలకొంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. చింతగూడ గ్రామానికి చెందిన సంపంగి పెద్ద మల్లయ్య–రాజవ్వ దంపతుల కుమారుడు రాజమల్లు (35) 2017లో ఉపాధి కోసం ఇరాక్ వెళ్లి అక్కడే పనిచేస్తున్నాడు. ఇప్పటివరకు ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడేవాడు. ఈనెల 21న పనికి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజమల్లు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషయాన్ని స్నేహితులు సమాచారం అందించడంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. రాష్ట్రప్రభుత్వం రాజమల్లు మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించాలని కోరుతున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

దండేపల్లి: మండలంలోని నర్సాపూర్ శివారులో వ్యవసాయ పొలం వద్ద షెడ్‌లో గురువారం సాయంత్రం పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.1,550 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని లక్ష్మీనగర్‌లో తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై రాములు కథనం ప్రకారం.. బండి విద్యాసాగర్, తన భార్య ఉద్యోగులు. వీరు గురువారం ఉదయం ఇంటికి తాళం వేసి విధులకు వెళ్లారు. ఆలస్యంగా ఇంటికి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉంది. బీరువాలో ఉన్న రూ.30 వేల నగదు ఎత్తుకెళ్లారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గల్ఫ్‌కార్మికుడికి ఉపశమనం

- ఒకే పేరుపై రెండు పాస్‌పోర్టులు ఉండడంతో సమస్య
- ప్రవాసీమిత్ర లేబర్ యూనియన్ చొరవతో పరిష్కారం


సౌదీలో చిక్కుకున్న స్వామి


హైదరాబాద్ పాస్‌పోర్ట్ కార్యాలయం వద్ద మస్కాపూర్ వాసితో స్వదేశ్ పరికిపండ్ల

ఖానాపూర్: ఉపాధి కోసం రెండేళ్ల క్రితం సౌదీకి వెళ్లిన నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని మస్కాపూర్ గ్రామానికి చెందిన ఇనవేని స్వామి పాస్‌పోర్ట్ సమస్య కారణంగా అక్కడే చిక్కుకుని నానా ఇక్కట్లు పడుతున్నాడు. సౌదీలో అతను పనిచేసే కంపెనీ యజమాని వేధింపులు భరించలేక ఆరునెలలకే బయటకు వెళ్లి కల్లివెల్లిలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో తిరిగి స్వదేశానికి రావడానికి ప్రయత్నించగా అతని పాస్‌పోర్ట్ ముందుగా పనిచేసిన యజమాని వద్దే ఉండిపోయింది. కాగా, జూలైలో సౌదీలోని రియాద్ కాన్సులేట్ కార్యాలయానికి వెళ్లి గోడు వెళ్లబోసుకోగా వారు ఔట్ పాస్‌పోర్ట్ వర్తింపజేయడానికి తగిన రుసుము కట్టించుకున్నారు. అయినప్పటికీ నెలలు గడిచినా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో కాన్సులేట్‌కు వెళ్లగా అనుమానితుల కేటగిరీలో పేరు ఉండడంతో ఇండియాలోని హైదరాబాద్ రీజినల్ పాస్‌పోర్ట్ కార్యాలయానికి విచారణ కోసం పంపామని అక్కడి అధికారులు తెలిపారు. కాగా, ఈ విషయమై బాధితుడు కాంగ్రెస్ ఖానాపూర్ మండలాధ్యక్షుడు దయానంద్ దృష్టికి తీసుకెళ్లగా, అతను ప్రవాసీమిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్లకు తెలిపాడు. దీంతో ప్రవాసీమిత్ర బృందం హైదరాబాద్ కార్యాలయానికి వెళ్లి ఆరాతీశారు. మస్కాపూర్ గ్రామంలో ఇదే పేరుపై మరో వ్యక్తికి పాస్‌పోర్టు ఉండడంతో పాటు వారి తల్లి దండ్రుల పేర్లు, పుట్టిన తేదీలు ఒకేలా ఉన్నాయి. వారిరువురు దగ్గరి బంధువులు కావడంతో ఫేస్ కూడా ఒకేలా ఉంది. ఇద్దరూ గతంలో దుబాయ్ వెళ్లి వచ్చిన వారు కావడంతో కాన్సులేట్ కార్యాలయాల్లో వివరాలు నమోదయ్యాయి. దీంతో మస్కాపూర్ గ్రామానికి చెందిన మరో వ్యక్తి స్వామిని వారు హైదరాబాద్ కార్యాలయానికి తీసుకెళ్లి పూర్తి వివరాలు అందించి సమస్య పరిష్కారానికి కృషిచేశారు. కాగా, స్వామిని సౌదీ నుంచి త్వరలోనే ఇండియాకు తీసుకురావడానికి ఉన్న అడ్డంకులు తొలగిపోయాయని స్వదేశ్ పరికిపండ్ల తెలిపారు.

పీఆర్‌టీయూతోనే సమస్యలు పరిష్కారం


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఇన్నారెడ్డి

తాండూర్: ఉపాధ్యాయుల సమస్యలు పీఆర్‌టీయూతో పరిష్కారమవుతాయని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుమలరెడ్డి ఇన్నారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సంఘం మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం నూతన మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సంబరం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా భువనగిరి మధుసూదన్, అసోసియేట్ అధ్యక్షుడుగా అజీముద్దీన్, మహిళా ఉపాధ్యక్షులుగా మీసాల శైలజ, కార్యదర్శిగా తిరుక్కోవల రమేష్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా మాసాడి శ్రీరాములు, భరత్ కుమార్ వ్యవహరించారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నస్పూర్: సింగరేణిలో రిటైర్డ్ అయిన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సింగరేణి విశ్రాంత కార్మిక సంఘం నాయకులు గోదావరిఖనిలోని కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయంలో కమిషనర్ పచోరికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 11వ వేజ్ బోర్డు వేతన సవరణ ప్రకారం తమకు రివైజ్ పెన్షన్ అమలు చేయాలన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సంఘం తరుపున గతంలో సీఎంకు, వివిధ కార్మిక సంఘాల నాయకులకు వినతిపత్రాలు ఇచ్చినా నేటికీ పరిష్కారం కాలేదని తెలిపారు. కొత్త పెన్షన్ ఆర్డర్ కాపీలు ఇవ్వాలని పేర్కొన్నారు. జిల్లా విశ్రాంత కార్మిక సంఘం అధ్యక్షుడు వెంకటయ్య, గౌరవ అధ్యక్షుడు రాజయ్య పాల్గొన్నారు.

ఇద్దరు ఉపాధ్యాయులకు షోకాజు నోటీసు

ఆదిలాబాద్‌టౌన్: నేరడిగొండ మండలంలోని శంకరాపూర్ ఎంపీపీఎస్ పాఠశాల ఉపాధ్యాయుడికి డీఈవో ప్రణీత గురువారం షోకాజు నోటీసు జారీ చేశారు. ఉపాధ్యాయుడు హేమాజీ..పాఠశాలకు సక్రమంగా రావడం లేదని, విద్యాబోధన చేయడం లేదని గ్రామస్తులు ఈనెల 8న కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేపట్టాలని డీఈవో, ఎంఈవో, స్కూల్ కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్‌ను ఆదేశించారు. విచారణ అనంతరం డీఈవో ఆయనకు షోకాజు నోటీసు జారీ చేశారు.

ఏడేళ్ల నిరీక్షణకు తెర

- గురుకుల పీఈటీ కొలువులకు ఇద్దరు ఎంపిక


మహేశ్


ప్రభాకర్

వేమనపల్లి: ఏడేళ్లుగా కోర్టు వివాదంతో పెండింగ్‌లో ఉన్న గురుకుల పీఈటీ పోస్టుల ఎంపిక నిరీక్షణకు తెరపడింది. 594 పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను బుధవారం రాత్రి టీజీపీఎస్సీ విడుదల చేసింది. 2017 ఏప్రిల్ 14న నోటిఫికేషన్ జారీ, గతంలో పరీక్షలు జరుగగా, న్యాయ వివాదాలతో ఫలితాల ప్రకటన వాయిదా పడింది. తాజా విడుదలైన పీఈటీ ఫలితాల్లో మండలానికి చెందిన ఇద్దరు ఎంపియ్యారు.

తమ్ముడు, చిన్నాన్నల ప్రోత్సాహంతో..

మండలంలోని జాలరివాడకు చెందిన తోకల మహేశ్ తల్లిదండ్రులు మధునక్క, కిష్టయ్యలు వ్యవసాయం చేస్తున్నారు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో ఆయన పీఈటీ పోస్టుకు ఎంపికయ్యాడు. తమ్ముడు రవి ఫిజికల్ డైరెక్టర్‌గా కుమురంభీం జిల్లా చిన్నరాజ్‌పల్లి పాఠశాలలో పని చేస్తుండగా చిన్నాన్నలు తోకల నారాయణ ఎస్‌జీటీ గెర్రెగూడంలో, తోకల సంతోష్ ట్రాన్స్‌కో ఏఈ నాగర్‌కర్నూల్‌లో విధులు నిర్వహిస్తున్నారు. వీరిని ప్రేరణగా తీసుకుని మహేశ్ కష్టపడి కొలువు సాధించాడు. అప్పు చేసి కొడుకుని చదివించగా కొలువు సాధించడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

సేద్యం నుంచి ఉద్యోగానికి..

తల్లిదండ్రులు మల్లక్క–శివరాంలు కలిసి వ్యవసాయ పనులు చూసుకుంటున్న నీల్వాయికి చెందిన కుమ్మరి ప్రభాకర్ పీఈటీ కొలువుకు ఎంపికయ్యాడు. ఈయన 2009 నుంచి 2011 వరకు నీల్వాయి కేజీబీవీ టీచర్‌గా పని చేశాడు. 2011 నుంచి 2016 వరకు సాక్షర భారత్ మండల కోఆర్డినేటర్‌గా విధులు నిర్వహించాడు. గతంలో గురుకుల పీఈటీ పరీక్ష రాయగా, తాజాగా విడుదలైన ఫలితాల్లో ఆయన ఎంపికయ్యారు.

మహిళా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


డీజీఎంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియా వర్క్‌షాప్, ఆటో గ్యారేజీలో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే.వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, ఏరియా బ్రాంచి కార్యదర్శి ఎస్కే బాజీసైదా డిమాండ్ చేశారు. ఏరియా వర్క్‌షాప్, ఆటో గ్యారేజీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డీజీఎం రవీందర్‌కు గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మహిళా ఉద్యోగులకు మధ్యాహ్నం 3గంటలకు అవుట్ మస్టర్ వేయాలని, ప్రత్యేక రెస్ట్ హాల్స్, వాష్‌రూమ్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. మహిళా ఉద్యోగులకు చీరలకు బదులుగా చూడీదార్ మెటీరియల్ సరఫరా చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫిట్ కార్యదర్శి సదానందం, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, నాయకులు దామోదర్, రాఘవరాజు, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'నాటుదాం ఒక చెట్టు'


నర్సింగాపూర్‌లో మొక్కలు నాటుతున్న అధికారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం నర్సింగాపూర్ గ్రామ పంచాయతీలోని రాజరాజేశ్వర రైస్‌మిల్ వద్ద గురువారం నాటుదాం ఒక చెట్టు.. అమ్మ పేరు మీద అనే కార్యక్రమంలో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. మండలంలోని గ్రామాల్లో మొక్కలు నాటగా ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా అమ్మ పేరు మీద మొక్క నాటాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ కిషన్, ఎంపీడీఓ మధుసూదన్, ఈజీఎస్ ఏపీఓ మల్లయ్య, ఈసీ శ్రీనివాసరెడ్డి, టీఏ అన్నమని, పంచాయతీ కార్యదర్శి స్వరూప, రైస్‌మిల్ యజమాని రాజేశం, పంచాయతీ, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాల పురస్కార అవార్డుకు దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార అవార్డు 2025కు ప్రతిభ గల బాలబాలికల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి స్వరూపారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఆవిష్కరణలు, సామాజిక సేవా రంగంలో మహిళలు, పిల్లలు, ఇతరుల హక్కులపై సంఘాన్ని ప్రేరేపించడం, నిర్వహించడం, సమీకరించడం వంటి నాయకత్వ నైపుణ్యాలు, పర్యావరణ రంగంలో పర్యావరణ సమస్యలపై తీవ్ర స్థాయిలో ప్రయత్నాలు చేసి విజయం సాధించిన వారు, క్రీడా రంగంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడలలో స్థిరమైన విజయాలు, కళ సంస్కృతి రంగంలో కళ, సంగీతం(గాత్రం, వాయిద్యం), నృత్యం, పెయింటింగ్, ఇతర కళ/సంస్కృతిలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సైన్స్ – టెక్నాలజీ సమస్యలలో స్థిరమైన విజయాలు పరిగణిస్తారని తెలిపారు. ఈ నెల 31లోగా ఆన్‌లైన్‌లో అవార్డు పోర్టల్‌లో https:// awards. gov. in లో నమోదు చేసుకోవాలని తెలిపారు.

24న అండర్-19 టేబుల్ టెన్నిస్ ఎంపిక పోటీలు

మంచిర్యాలఅర్బన్: జైపూర్ తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల (బాలుర)లో జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 24న అండర్-19 బాల, బాలికల ఉమ్మడి జిల్లాస్థాయి టెబుల్ టెన్నిస్ ఎంపిక పోటీలు ఉంటాయని ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి బాబురావు తెలిపారు. 2006 జనవరి 1 తర్వాత జన్మించి ఆరో తరగతి ఆపై ఇంటర్ చదువుతున్న విద్యార్థులు ఈ పోటీలకు అర్హులని పేర్కొన్నారు. క్రీడాకారులు తమ కాలేజీ బోనాఫైడ్, ఆధార్ జిరాక్స్ తీసుకుని పోటీల కన్వీనర్ నాగేశ్వర్‌రావు, టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ పాఠశాల పీడీ సంతోష్‌కుమార్‌ను సంప్రదించాలని సూచించారు. ఈనెల 23 సాయంత్రం 4గంటల లోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

అండర్–14, 17 జిల్లా స్థాయిలో..

జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 24న టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ జైపూర్‌లో అండర్–14, 17 జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఫణిరాజా తెలిపారు. అండర్–14 విభాగంలో పాల్గొనే వారు జనవరి 1, 2011 తర్వాత జన్మించి ఆరో తరగతి ఆపై తరగతులు చదివినవారు అర్హులని పేర్కొన్నారు. అండర్–17 విభాగంలో పాల్గొనేవారు జనవరి 1, 2008 తర్వాత జన్మించి ఆరో తరగతి, ఆపై తరగతులు చదివినవారై ఉండాలని పేర్కొన్నారు. వివరాలకు ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు సంప్రదించాలని సూచించారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని కాపాడిన పోలీసులు

మంచిర్యాలక్రైం: రైలు పట్టాలపై ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని మంచిర్యాల బ్లూ కోల్ట్స్ పోలీసులు గురువారం కాపాడారు. స్థానిక సీఐ బన్సిలాల్ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక వాటర్ ట్యాంక్ ప్రాంతానికి చెందిన హరిదాస్ సాయికృష్ణ(29) కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా ఏసీసీ ఫ్యాక్టరీ వెనుకాల రైలు కింద పడి ఆత్మహత్య చేసుకోవాలని చేరుకున్నాడు. స్థానికులు 100డయల్‌కు కాల్ చేసి సమాచారం అందించారు. దీంతో బ్లూ కోల్ట్స్ కానిస్టేబుల్ సత్యనారాయణ, రాజ్‌కుమార్ ఘటన స్థలానికి చేరుకుని సాయికృష్ణ ప్రాణాలను కా పాడారు. కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం డీ అడిక్షన్ సెంటర్‌లో పరీక్షలు నిర్వహించి అప్పగించారు. కానిస్టేబుళ్లకు నగదు రివార్డు అందజేశారు.